క్లుప్తంగా...

కీసరగుట్టలో ప్రారంభమైన శ్రావణమాసోత్సవ పూజలు

కీసర: ప్రఖ్యాత శైవక్షేత్రమైన కీసరగుట్టలోని శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి సన్నిధిలో శ్రావణమాసోత్సవాల ప్రత్యేక పూజా కార్యక్రమాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు గర్భాలయంలో కొలువైన శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, అనంతరం క్షీరాభిషేకం పూజలను వేదపండితులు కన్నులపండువగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ తటాకం రమేష్, ఈఓ నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని వినతి



మేడ్చల్‌రూరల్: తమ వేతనాలు పెంచుతూ, క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో పనిచేస్తున్న బిల్‌కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, సిబ్బంది గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ రాములుకు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలో కొన్నేళ్లుగా పనిచేస్తున్న తాము ఎన్నో సేవలు అందిస్తున్నా సరైన వేతనం లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. వెంటనే తమకు రెగ్యులరైజ్ చేసి వేతనాలు పెంచాలని, ఈ మేరకు తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో బిల్‌కలెక్టర్లు ప్రసాద్, సంతోష్, సుజాత సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్

మేడ్చల్:పట్టణంలోని 11వ వార్డులో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కౌన్సిలర్ సుహాసిని ప్రారంభించారు. వార్డు పరిధిలోని రైల్వే స్టేషన్ సమీపంలో చర్చి ప్రాంతంలో రూ.10 లక్షల వ్యయంతో రోడ్డును నిర్మిస్తున్నట్లు తెలిపారు. వార్డులోని అన్ని వీధుల్లో మంత్రి మల్లారెడ్డి నిధులతో రోడ్లు వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, వెంకటేష్, సత్యనారయణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఒరియంటేషన్ డేలో మంత్రి మల్లారెడ్డి



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీ ఆడిటోరియంలో గురువారం ఒరియంటేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి, యూనివర్సిటీ డైరెక్టర్లు మహేందర్‌రెడ్డి, భద్రారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



మేడ్చల్: పట్టణంలోని అత్వెల్లికి చెందిన వివిధ పార్టీల నాయకులు మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కాంగ్రెస్‌కు చెందిన మాజీ వార్డు సభ్యుడు గోగికార్ హరి తన అనుచరులతో కలిసి మంత్రి మల్లారెడ్డి నివాసానికి వెళ్లగా ఆయన వారికి స్వాగతం పలికి పార్టీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌యాదవ్, శేఖర్‌గౌడ్, ఈశ్వరయ్య, రవికుమార్, సత్యనారాయణ, దయానంద్‌యాదవ్, అక్తర్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలి



మేడ్చల్: మున్సిపాలిటీల పరిధిలో పనిచేస్తున్న బిల్ కలెక్టర్‌లు, వాటర్‌మెన్, ఎలక్ట్రీషన్, కార్యాలయ సిబ్బందిని రెగ్యులరైజ్ చేసి వేతనాలు పెంచాలని కోరుతూ మున్సిపల్ సిబ్బంది మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డికి వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలో ఆమెను కలిసి వినతి పత్రం అందజేసి సమస్యలను విన్నవించుకున్నారు. వీఆర్‌ఏలను మున్సిపల్ శాఖలో విలీనం చేస్తున్నందున భవిష్యత్‌లో తమ భవిష్యత్ దెబ్బతినే పరిస్థితి ఉందని, తాము ఏళ్లుగా మున్సిపల్ శాఖలో పనిచేస్తున్నామని, అందరినీ రెగ్యులరైజ్ చేసి వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్లు సుందర్‌రెడ్డి, పెంటయ్య సిబ్బంది పాల్గొన్నారు.

మామా.. అల్లుడా?



మేడ్చల్ బరిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎవరని చర్చ?

మంత్రి కుటుంబంలో కాకపుట్టిస్తున్న ఎన్నికల వేడి

- టికెట్ తనదే.. గెలుపు తనదే.. అంటున్న మల్లారెడ్డి
- అన్ని ప్రాంతాల్లో జోరుగా పర్యటనలు, చకచకా పనులు

"వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ టికెట్ల కేటాయింపులో మార్పులు చేర్పులు ఉంటాయని ఆ పార్టీ అధిష్టానం సంకేతాలు జారీ చేస్తుండటంతో మేడ్చల్ అసెంబ్లీ బీఆర్‌ఎస్ టికెట్‌పై జోరుగా చర్చలు జరుగుతున్నాయి. పదేళ్ల క్రితం మంత్రి మల్లారెడ్డి, ఐదేళ్ల క్రితం ఆయన అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి మేడ్చల్ రాజకీయాల్లోకి ప్రవేశించారు. కార్పొరేట్ రాజకీయాలతో ఇద్దరు నేతలు మేడ్చల్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఏళ్ల తరబడి రాజకీయాలు చేయకున్నా, కిందిస్థాయి రాజకీయాల్లో నుంచి రాకున్నా తమ వద్ద ఉన్న ధనబలంతో ఇద్దరు నేతలు రాజకీయ అరంగేట్రం చేశారు." – మేడ్చల్

ఎంపీగా మొదలై మంత్రి వరకు..

విద్యాసంస్థల అధిపతిగా ఉన్న మంత్రి మల్లారెడ్డి 2014లో టీడీపీలో చేరి మల్కాజిగిరి ఎంపీ టికెట్ సాధించి నాటి ఎన్నికల్లో ఎంపీగా విజయం సాధించి ఆ తర్వాత తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్‌ఎస్‌లో చేరారు. 2019 ఎన్నికల్లో అనూహ్యంగా మేడ్చల్ అసెంబ్లీ బీఆర్‌ఎస్ టికెట్ సాధించి ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రి అయ్యారు. అదే సమయంలో మల్లారెడ్డి తన అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి, కుమారులు మహేందర్‌రెడ్డి, భద్రారెడ్డి, కూతురు మమతరెడ్డిలను నియోజకవర్గానికి పరిచయం చేసి నాటి ఎన్నికల్లో పని చేయించి విజయం సాధించారు. పెద్ద కుమారుడు మహేందర్‌రెడ్డిని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమింపజేశారు. తాజాగా ఇద్దరు కుమారులు భద్రారెడ్డి, మహేందర్‌రెడ్డిలు తండ్రి చాటు తనయులుగా ఉంటూ మేడ్చల్ రాజకీయాన్ని మొత్తం నడిపిస్తున్నారు.

ఎంపీగా ఓడిపోయి..

మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో మామ కోసం పని చేసి పార్లమెంట్ ఎన్నికల సమయంలో అరంగేట్రం చేశారు. బీఆర్‌ఎస్ టికెట్‌పై మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేతిలో ఓటమి చవిచూశాడు. ఓటమి తర్వాత బీఆర్‌ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. రాజశేఖర్‌రెడ్డి నాయకత్వాన్ని మంత్రి మల్లారెడ్డి మినహా సెగ్మెంట్ పరిధిలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పెద్దగా ఒప్పుకోకపోవడంతో ఆయన మేడ్చల్‌కే పరిమితం అయ్యాడు. చాలా రోజులు మేడ్చల్ రాజకీయాన్ని ఆయన నడిపి తనకంటూ ప్రత్యేక అభిమానులను తయారు చేసుకున్నారు. ఇటీవల ఆయన నగరంలోని ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానం కంటోన్మెంట్ అసెంబ్లీకి బీఆర్‌ఎస్ ఇన్‌చార్జిగా నియమించింది. తాజాగా ఆయన కంటోన్మెంట్ రాజకీయాలతో అక్కడే బిజీ అయ్యారు. మంత్రి మల్లారెడ్డి తమ హావాభావాలతో సోషల్ మీడియా స్టార్ అయినా.. ప్రజల్లో కొద్దిగా వ్యతిరేఖత ఉందనో, బలమైన నాయకుడని ఢిల్లీలో అవసరమనో..? ఆయనను ఎంపీగా పంపాలనో బీఆర్‌ఎస్ అధిష్టానం ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.

మేడ్చల్ బీఆర్‌ఎస్‌లో జోరుగా చర్చలు

మంత్రికి ఎమ్మెల్యే టికెట్ నిరాకరిస్తే అల్లుడు రాజశేఖర్‌రెడ్డిని రంగంలోకి దించాలనే వార్త కథనాలు పత్రికల్లో రావడంతో స్థానికంగా చర్చలు జోరుగా మొదలయ్యాయి. మంత్రి అనుచరులు తమ నాయకుడికే అని, రాజశేఖర్‌రెడ్డి అనుచరులు తమ నాయకుడికే వస్తుందని మల్లారెడ్డిని ఎంపీగా పంపుతారని కొంతమంది వాదిస్తుండగా అల్లుడికి ఎందుకు టికెట్ వస్తుంది.. ఇద్దరు కుమారులు ఇద్దరు కోడళ్లు ఉన్న మంత్రి కుటుంబంలోనే టికెట్ వస్తుందని బీఆర్‌ఎస్‌లో జోరుగా చర్చలు జరుగుతున్నాయి. మంత్రి మల్లారెడ్డి మాత్రం టికెట్ తనదే.. గెలుపు తనదే.. అని బహిరంగంగానే ప్రకటిస్తూ ధీమాగా ఉన్నారు.

అడిగిన వెంటనే పనులు చేయిస్తూ..

సొంత నిధులతో పనులు చేయిస్తూ మంత్రి కుమారులు మహేందర్‌రెడ్డి, భద్రారెడ్డిలు నియోజకవర్గాన్ని సగంగా విభజించుకుని జోరుగా పనులు చేయిస్తూ అన్ని ప్రాంతాల్లో కలియ తిరుగుతున్నారు. మంత్రి గ్రామాల్లో, పట్టణాల్లో పాదయాత్ర అంటూ పర్యటిస్తూ సమస్యలు తెలుసుకుని అడిగిన వెంటనే కుమారులను పిలిచి డబ్బులు కేటాయించి వెంటనే పనులు పూర్తిచేయిస్తూ ఎన్నికలకు సమాయాత్తం అవుతుండగా.. అధిష్టానం పరోక్ష సంకేతాలు ఇస్తుండటంతో మేడ్చల్ బీఆర్‌ఎస్‌తో పాటు మంత్రి మల్లారెడ్డి ఇంట్లో కాకపుట్టిస్తోంది. అసెంబ్లీ టికెట్ మల్లారెడ్డి కుటుంబంలో రావడం పక్కాగా కనిపిస్తున్నా మల్లారెడ్డికా.. అల్లుడికా.. పుత్రులకా..? ఎవరికనేది సీఎం కేసీఆర్‌కే తెలియాలని పలువురు అంటున్నారు.

బ్రెయిన్ విజన్‌తో ఎమ్మార్‌సీఈ ఎంఓయూ



ఎంఓయూ పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్(ఎమ్మార్‌సీఈ) కళాశాల హైదరాబాద్‌కు చెందిన బ్రెయిన్ విజన్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు ఎంఓయూ పత్రాలపై కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, సంస్థ అధినేత గణేష్‌లు సంతకాలు చేసి పత్రాలను మార్చుకున్నారు. ఈ ఒప్పందంతో కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులకు నిర్వహించే వర్క్‌షాప్, సెమినార్, గెస్ట్ లెక్చర్, ఎఫ్‌డీపీ వంటి కార్యక్రమాలను బ్రెయిన్ విజన్ సంస్థ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సుధీర్‌రెడ్డి, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సాగు భూములను శ్మశానాలకు ఎలా కేటాయిస్తారు?



నూతన్‌కల్‌లో శ్మశానవాటికకు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

మేడ్చల్: గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న భూములను ప్రభుత్వం ముస్లిం శ్మశానవాటికలకు ఎలా కేటాయిస్తారని హిందు బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్లు ప్రశ్నించారు. నియోజకవర్గంలోని మేడ్చల్ మండలం నూతన్‌కల్ సర్వే నంబర్ 472లో 36 ఎకరాలు, శామీర్‌పేట్ మండలం తుర్కపల్లిలో సర్వే నంబర్ 523లో 16 ఎకరాల భూమిని ప్రభుత్వం ముస్లిం శ్మశానవాటికల కోసం కేటాయించిందని, రైతులు సాగు చేసుకుంటున్న భూములను శ్మశానవాటికలకు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. కేటాయించిన స్థలాలను నాయకులతో కలిసి సందర్శించారు. కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఓ వర్గం మెప్పు కోసం భూములు కేటాయిస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. హిందూ బీసీ మహాసభ తరఫున అన్యాయంపై పోరాటం చేస్తామని అన్నారు. సందర్శనలో మహాసభ నాయకులు ఆంజనేయులు, విజయ్‌కుమార్ ఉన్నారు.

దళిత బంధును వేగంగా అమలు చేయాలి



మంత్రి మల్లారెడ్డికి వినతి పత్రం అందజేస్తూ..

మేడ్చల్: దళితుల అభ్యున్నతి కోసం చేపట్టిన దళిత బంధు పథకాన్ని వేగంగా అమలు చేయాలని అంబేడ్కర్ సంఘం నాయకులు మంత్రి మల్లారెడ్డి కోరారు. సంఘం నాయకులు మంత్రి మల్లారెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను కలిసి దళిత బంధును వేగంగా అమలు చేసి దళితులందరికీ సహాయం అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ఇన్‌చార్జి విజయ్‌కుమార్, అధ్యక్షుడు రాములు నాయకులు నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

ప్రహరీ కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి



కొండాపూర్ శ్రీనిధి వెంచర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ప్లాట్ల యజమానులు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని కొండాపూర్ శ్రీనిధి ఇంపీరియల్ వెంచర్‌లో తమ ప్లాట్ల హద్దు రాళ్లు, ప్రహరీని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు ప్లాట్ల యజమానులు గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్-63, 67లోని ప్లాట్లను రెండు దశాబ్దాల క్రితం కొనుగోలు చేశామని, ఒక్కో ప్లాటు ఐదారుగురి చేతులు మారాయన్నారు. కొనుగోలు చేసిన ప్లాట్లకు సంబంధించిన భూమి మాదంటూ కొందరు రాత్రి సమయంలో కూల్చివేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు విచారణ జరిపి న్యాయం చేయాలని వెంకటేశ్‌గౌడ్, రమేశ్ తదితరులు కోరారు.

25 రోజులుగా నీటి సరఫరా లేదు



శివాజీనగర్ కాలనీవాసులకు నీటిని సరఫరా చేస్తున్న నల్ల వెంకట్‌రెడ్డి

కీసర: కీసరలోని శివాజీనగర్ కాలనీకి 25 రోజులుగా మంచినీటి సరఫరా కావడం లేదని బీజేపీ జిల్లా యువమోర్చా ఉపాధ్యక్షుడు నల్ల వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం ఈ మేరకు కాలనీలో పర్యటించిన ఆయన సొంత డబ్బులతో మూడు నీటి ట్యాంకర్లను కొనుగోలు చేసి ఇంటింటికీ నీటి సరఫరా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శామీర్‌పేట చెరువు వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోవడంతో నీరు సరఫరా కావడం లేదని పంచాయతీ పాలకవర్గం, అధికారులు పేర్కొంటున్నారు. 25 రోజులు కాలనీవాసులకు పంచాయతీ పాలకవర్గం సరిపడా నీటిని ఎందుకు సరఫరా చేయడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైప్‌లైన్ మరమ్మతులు త్వరగా పూర్తిచేసి ప్రజల నీటి కష్టాలు తీర్చాలన్నారు.

'శ్రీనిధి'పై కేసు నమోదు చేయాలి



మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్

ఘట్‌కేసర్: యంనంపేట్ శ్రీనిధి కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీనిధి కళాశాలకు యూనివర్సిటీ అనుమతులు లేకున్నా 300 మందికి పైగా విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చి మోసం చేసిందన్నారు. విద్యార్థుల విలువైన సంవత్సరం కోల్పోకుండా ఉన్నత విద్యామండలి ఆదేశం మేరకు ఇతర కళాశాలల్లో చేరిన వారి ఫీజు వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్వర్, చిన్న, హరీశ్, శశిధర్ పాల్గొన్నారు.

కార్పొరేట్ దోపిడీ సంస్థకు మరో పేరు 'శ్రీనిధి'

పట్టణంలోని ప్రెస్ క్లబ్ ఆవరణలో ఏబీవీపీ ఆధ్వర్యంలో శ్రీనిధి యూనివర్సిటీ గుర్తింపును రద్దు చేయాలని గురువారం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మనోహర్, ఎల్బీనగర్ విభాగ్ టెక్నికల్ సెల్ కన్వీనర్ సచిన్ మాట్లాడుతూ శ్రీనిధి యూనివర్సిటీ యాజమాన్యం ధనార్జనే ధ్యేయంగా మొదటి సంవత్సరం విద్యార్థుల నుంచి చివరి సంవత్సరం ఫీజు కూడా వసూలు చేయడం సిగ్గుచేటని, 287 మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఘట్‌కేసర్ కార్యదర్శి భాను, అవినాశ్ తదితరులు పాల్గొన్నారు.

హుడా భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని హుడా భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్‌ఎండీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్టేట్ అధికారి రమణారెడ్డి అన్నారు. జవహర్‌నగర్‌లోని సీఆర్‌పీఎఫ్, మల్కారంలోని హుడా భూముల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను గురువారం హెచ్‌ఎండీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ యంత్రాంగం, స్థానిక పోలీసుల సహకారంతో కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్‌ఎండీఏ హుడా భూముల్లో కొంతమంది కబ్జాదారులు లేఅవుట్ చేసి అమాయక ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో హుడా, పోలీసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన బోధన అందిస్తున్నాం

- వీవీ ఇనిస్టిట్యూషన్స్ ప్రెసిడెంట్ జీఎస్ఎస్‌వీ వెంకటేశ్వరావు
- విశ్వవిశ్వాని ఇనిస్టిట్యూట్‌లో ప్రారంభమైన పీజీడీఎం ప్రోగ్రాం



జ్యోతి వెలిగించి సమావేశాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

మేడ్చల్: ప్రముఖ మేనేజ్‌మెంట్ విద్యాసంస్థ విశ్వవిశ్వాని ఇనిస్టిట్యూట్ ఆఫ్ సిస్టమ్స్ అండ్ మేనేజ్‌మెంట్(వీవీఐఎస్‌ఎం) తన 18వ పీజీడీఎం ప్రోగ్రాంను ప్రారంభించింది. ఈ సందర్భంగా వీవీ ఇనిస్టిట్యూషన్స్ ప్రెసిడెంట్ జీఎస్ఎస్‌వీ వెంకటేశ్వరావు మాట్లాడుతూ పీజీడీఎం ప్రోగ్రాం ప్రారంభం కేవలం అకాడమిక్ కార్యకలాపాలకు మాత్రమే కాకుండా పరిశ్రమల మధ్య సంబంధాలు పెంచేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన బోధనలు చేస్తూ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. రెండు దశాబ్దాలుగా విద్యార్థులను ఉన్నతస్థాయిలో తీర్చిదిద్దిన వైనాన్ని ఆయన వివరించారు. అకాడమిక్ ఎక్సలెన్స్ ఇండస్ట్రీస్ ఎంగేజ్‌మెంట్ పట్ల తమ సంస్థ నిబద్ధతతో ఉందని అన్నారు. అవినియోన్ ప్రైవేట్ లిమిటెడ్ వీపీ వెంకటేష్ పీజీడీఎం ప్రయాణం, దాని ప్రాముఖ్యతను వివరించారు. పూర్వ విద్యార్థులు తాము సంస్థలో చదువుకుని జీవితంలో రాణించిన తీరును వివరించారు. సమావేశంలో డైరెక్టర్ డాక్టర్ లక్ష్మణ్‌కుమార్, ప్రొఫెసర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారానికే పరిమితమైన బీఆర్‌ఎస్



గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద మురళీధర్‌రావు, విక్రంరెడ్డి



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జి మురళీధర్‌రావు

మేడ్చల్‌రూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం పథకాల పేరుతో ప్రచారాలకే పరిమితమైందని, ఆచరణలో పెట్టడం లేదని బీజేపీ మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జి మురళీధర్‌రావు అన్నారు. అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. మురళీధర్‌రావుతో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి మాట్లాడారు. సీఎం కేసీఆర్ మాయమాటలు చెప్పి ప్రజలను మభ్యపెడుతున్నాడే తప్ప చేసిందేమీ లేదన్నారు. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తానని గద్దెనెక్కిన కేసీఆర్ 9 ఏళ్లు గడుస్తున్నా.. అర్హులకు ఎందుకు ఇళ్లు కేటాయించడం లేదో తెలపాలని ప్రశ్నించారు. కేసీఆర్ తీరుగానే మంత్రులు కూడా స్వలాభం కోసం పాటు పడుతున్నారే తప్ప ప్రజలను పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల ట్రాన్స్‌ఫర్లకు సైతం మంత్రులు, ఎమ్మెల్యేలు డబ్బులు దండుకుంటున్నారని, బీఆర్‌ఎస్ ఓ దందా పార్టీగా మారిందని ఆరోపించారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్, కౌన్సిలర్ సరస్వతి, నాయకులు రవీందర్‌గౌడ్, కిషన్, శివరాజ్, అర్జున్ బాబు, అశోక్, మహేశ్, శ్రీధర్, విక్రం, శ్రీకాంత్, నవీన్ మహిళలు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం బీజేపీ ధర్నా

మేడ్చల్: ఇళ్లు లేని పేదలు ఎంతోమంది ఉన్నా ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వకుండా ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ నాయకులు ఆరోపించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీజేపీ పట్టణ నాయకులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ గూడు లేక పేదలు అవస్థలు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చేంత వరకు బీజేపీ పోరాటం ఆగదని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ఆంజనేయులు, నరేందర్‌రెడ్డి, పోచయ్య, శ్రీనాథ్‌రెడ్డి, ప్రేందాస్, సర్వేశ్వర్‌రెడ్డి వంశీ వంజరి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మణ్, అర్జున రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు డబుల్ ఇళ్లు ఇవ్వాలి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలో అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందజేయాలని డిమాండ్ చేస్తూ గురువారం నాగారం మున్సిపల్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఏనుగు రాజిరెడ్డి మాట్లాడుతూ రాంపల్లి పరిధిలోని సర్వే నంబర్-258లో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో 10 శాతం పనిముట్ల సంఘానికి, మరో 10 శాతం గ్రామస్తులకు ఇస్తామని గతంలో ప్రభుత్వ పాలకులు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు బుద్ధవరం వేణుగోపాల్, కౌన్సిలర్ లక్ష్మీ, నేతలు జంగారెడ్డి, సూర్యశేఖర్‌రెడ్డి, సుర్వి యాదగిరిగౌడ్, రవీందర్‌రెడ్డి, కొండబోయిన నాగరాజుయాదవ్, భువనేశ్వరి, మల్లేష్, జూపల్లి నరేష్, శ్రీనివాస్‌రెడ్డి, మాధవరావు, మునీశ్వర్‌రెడ్డి, కొండేటి లక్ష్మారెడ్డి, మహేందర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, జయప్రకాష్, కమలాకర్, రాజశేఖర్‌రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం ధర్నా

పోచారం: అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో పోచారం మున్సిపల్ ఆఫీస్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ వేమనరెడ్డికి వినతిపత్రం అందజేశారు. గిరిజన మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బిక్కునాథ్ నాయక్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శోభారెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు సురేష్ నాయక్ పాల్గొన్నారు.



నాగారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నేతలు



పోచారం మున్సిపల్ ఆఫీస్ ఎదుట నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు

మహాధర్నా వాల్ పోస్టర్ ఆవిష్కరణ

మేడ్చల్: తపస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సమస్యలపై ఈ నెల 19న చేపట్టే మహాధర్నా వాల్ పోస్టర్‌ను మేడ్చల్ పరిధిలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ధర్నాకు హాజరు కావాలని కోరారు. తపస్ రాష్ట్ర కార్యదర్శి నవీన్, రాజ్‌కుమార్, వెంకటరమణ ఉన్నారు.

టెక్నాలజీ వినియోగించుకొని ముందుకు సాగాలి

కిమ్స్ ఫౌండేషన్స్, రీసెర్చ్ సెంటర్ చైర్మన్ డా.వి.భుజంగ్‌రావు



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న భుజంగ్‌రావు తదితరులు

కీసర: విద్యార్థులు కష్టపడి దువుల్లో రాణించాలని కిమ్స్ ఫౌండేషన్స్, రీసెర్చ్ సెంటర్(కెఎఫ్ఆర్‌సీ) చైర్మన్ డా.వి.భుజంగ్‌రావు అన్నారు. కీసరలోని మహాత్మాజ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల కళాశాలలో కిమ్స్ ఫౌండేషన్, రీసెర్చ్ సెంటర్ సీఐఐ తెలంగాణ సహకారంతో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ కార్యదర్శి మల్లయ్యబట్టు, సీఐఐ తెలంగాణ సీఎస్‌ఆర్, ఐటీసీ పీఎస్‌పీడీ వైస్ ప్రెసిడెంట్ కో కన్వీనర్ వి.ప్రభాకర్‌తో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నూతన సాంకేతికతను వినియోగించుకొని ముందుకు సాగాలన్నారు. 700 మంది విద్యార్థులకు ఉపయోగపడే విధంగా కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కిమ్స్ ఆస్పత్రి వైస్ ప్రెసిడెంట్ సుబోద్‌సింగ్, సీఐఐ తెలంగాణ డైరెక్టర్ సమీయుద్దీన్, కళాశాల ప్రిన్సిపల్ మారుతీకుమార్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.